క్లుప్తంగా

ఇంటివద్దనే పెన్షన్‌ల పంపిణీ

రాయచోటి అర్బన్ : జూలై 1వ తేదీ సోమవారం ఉదయం లబ్ధిదారుల ఇళ్ల వద్దనే సచివాలయం సిబ్బంది పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపడతారని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు తెలిపారు. పెరిగిన పెన్షన్ మొత్తం రూ.4వేలతో పాటు ఏప్రిల్, మే, జూన్ మాసాలకు వెయ్యి చొప్పున మూడు వేలు కలపి మొత్తం రూ. 7వేలను పెన్షన్‌దారులకు అందించడం జరుగుతుందన్నారు. మున్సిపల్ పరిధిలోని 34 వార్డులలో వివిధ కేటగిరిల కింద 8467 లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు అవసరమైన నగదు సిద్ధంగా ఉన్నాయన్నారు. పెన్షన్‌ల పంపిణీలో 170 మంది సచివాలయం సిబ్బంది పాల్గొంటారన్నారు.

నేటి నుంచి ఎన్‌టీఆర్ పెన్షన్ భరోసా

రామాపురం : నేటి నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి పెన్షన్‌ను లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఈ పెన్షన్ మండలంలోని నల్లగుట్టపల్లి, సరస్వతిపల్లె, తదితర గ్రామాలలో మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి పెన్షన్ పంపిణీని ప్రారంభిస్తారు. ఆయా గ్రామాల్లోని గ్రామ టీడీపీ నాయకుల సమక్షంలో గ్రామ సచివాలయం అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి పెన్షన్‌ను పంపిణీ చేయనున్నారు.

నల్లగంగమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో నల్లగంగమ్మ

సంబేపల్లి : సంబేపల్లె గ్రామంలో వెలసిన శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ తల్లికి ఆదివారం మహిళలు బోనాలు సమర్పించారు. ఆదివారం వేకువజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వర్షాలు కురిసి, పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి బోనాలు సమర్పించారు.

లయన్స్ క్లబ్‌కు నూతన కార్యవర్గం



నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పి.శివారెడ్డి

రాయచోటి అర్బన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్‌కు నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.ఎస్.హరినాథరెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 – 25 సంవత్సరానికి గాను అధ్యక్షుడుగా పి.శివారెడ్డి, కార్యదర్శిగా ఇందాద్ అహమ్మద్, కోశాధికారిగా కిషోర్‌కుమార్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కొత్తపాలక వర్గం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందేలా కృషిచేస్తారన్నారు.

ఆలయానికి విరాళం

చిట్వేలి : మండల పరిధిలోని స్తంభరాయుడు ఆలయం సమీపాన నూతనంగా నిర్మిస్తున్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి కె.కందుల వారిపల్లికి చెందిన కే.శేలు తుంగ అయ్యన్న నాయుడు కుమారుడు కన్యాకుమార్ రూ. 11,232లు ఆలయానికి వితరణగా అందించినట్లు ఆలయ నిర్మాణ ధర్మకర్త రామ్మోహన్ రావు ఆదివారం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు దాతకు కృతజ్ఞతలు తెలిపారు. దాతలు ఆలయ అభివృద్ధికి సహకారం అందించాలని వారు కోరారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం



కొత్తపల్లెలో బోరును వేయిస్తున్న దృశ్యం

రామాపురం : నల్లగుట్టపల్లె గ్రామం కొత్తపల్లెకు చెందిన ప్రజలకు తాగునీటి సమస్యను టీడీపీ యువ నాయకుడు శివారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన శనివారం రాత్రి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం తన స్వంత నిధులతో బోరును వేయించారు. గ్రామ అభివృద్ధికి ధ్యేయంగా పని చేస్తామని ఆయన తెలియజేశారు.

ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారం

వాల్మీకిపురం: బలిజల ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని బలిజసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక మదనపల్లి రోడ్డులోని విశ్రాంత ఏఎస్ఐ శంకరయ్య కార్యాలయంలో బలిజల ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలిజలు రాయలసీమ ప్రాంతంలో అత్యంత వెనుకబడి ఉన్నారని, పేరుకు సంఖ్యాబలం ఉన్న అటు ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుదలకు నోచుకోలేదని తెలిపారు. బలిజలు ఐకమత్యంగా ఉండి ఒకరికి ఒకరు పరస్పర సహకారం చేసుకుంటూ వెళ్తేనే అన్ని రంగాల్లో బలిజలు ముందడు వేయగలమని చెప్పారు. కార్యక్రమంలో టి.రామచంద్ర, శంకరయ్య, బొక్కసం రామక్రిష్ణ, ఆనంద, శేఖర్, వెంకటరమణ, వంశి, శ్రీనివాసులు, రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేని కాలువ గ్రామ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన నాగారపమ్మను రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలో లేదని అధైర్యపడవద్దని తెలిపారు. ఎంపీ మిథున్ రెడ్డి, తాను ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తమపై నమ్మకం ఉంచి తనను భారీ మెజార్టీతో గెలిపించిన మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అజంతారాణి, కన్వీనర్ రామస్వామిరెడ్డి, రెహమాన్ ఖాన్, జెడ్పీటీసీ ఇస్మాయిల్ బాషా, బీఎల్ నరసింహారెడ్డి, సర్పంచ్ రామ జయచంద్ర, సరోజ నాయక్, ఎంపీటీసీ రెడ్డమ్మ, రఫీక్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరారెడ్డి సేవలు ఎనలేనివి

నందలూరు : వీరారెడ్డి సేవలు ఎనలేనివని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన కె.వీరారెడ్డికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.మాధవీలత అధ్యక్షతన సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆకేపాటి.. వీరారెడ్డిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ వీరారెడ్డి వృత్తిపట్ల అంకితభావంతో పనిచేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ రాఘవరెడ్డి, ఐపీఈ, స్టేట్ గేమ్ సెక్రటరీ భానుమూర్తి రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు గడికోట వెంకటసుబ్బారెడ్డి, అక్కిరెడ్డి మోహన్ రెడ్డి, గొబ్బిళ్ల త్రినాథ్, అరిగెల సౌమిత్రి, కసిరెడ్డి నరసింహారెడ్డి, సుబ్బరామిరెడ్డి, ఇలియాస్, నరసింహారెడ్డి, గాండ్ల సుధాకర్ రెడ్డి, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, గుండు మల్లికార్జున రెడ్డి, ఆనాల మధు యాదవ్, మోడపోతుల సుధ, నందలూరు ఉప సర్పంచ్ ఇబ్బు, మధురాజు, కొర్లకుంట సుధాకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట రూరల్: ఆకేపాటికి సమస్యలు తెలియజేస్తున్న రోళ్లమడుగు గ్రామస్తులు

ఎమ్మెల్యే ఆకేపాటి విస్తృత పర్యటన

రాజంపేట రూరల్ : ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఆదివారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా కూచివారిపల్లిలో శనివారం శివైక్యం చెందిన జడల స్వామి పార్థివదేహానికి ఘనంగా నివాళులర్పించారు. జడల స్వామి మహిమలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపీ, ఊటుకూరు ఎంపీటీసీ నాగా శేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జాకీర్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సుండుపల్లె: నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఆకేపాటి అమర్నాథరెడ్డి



నందలూరు: వీరారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

తైక్వాండో విద్యార్థులకు అభినందన

అన్నమయ్య తైక్వాండో అకాడమీలో మాస్టర్ సగినాల పిచ్చయ్య వద్ద శిక్షణ పొందుతున్న ఉమర్, హర్షవర్ధన్‌లు విశాఖపట్నంలో తైక్వాండో రాష్ట్ర అధ్యక్షులు హర్షవర్ధన్, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళిల ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహించిన బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లో పాల్గొని ఫస్ట్ డాన్ బ్లాక్ బెల్ట్‌ను సాధించారు. వారిని స్థానిక ఆకేపాటి భవన్‌లో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆకేపాటి అభినందించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో కోచ్‌లు జావీద్‌అలీ, జ్ఞానసాయి, వైఎస్సార్‌సీపీ నాయకులు చొప్పా ఎల్లారెడ్డి, డీలర్ సుబ్బరామిరెడ్డి, సయ్యద్ అహ్మద్, శ్రీనివాసులు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

జాతరలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కె.బోయినపల్లిలోని యల్లాగడ్డలో ఘనంగా నిర్వహిస్తున్న గంగమ్మతల్లి జాతరలో వార్డు మెంబర్ సుబ్బరత్నమ్మ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా వార్డు మెంబర్ సుబ్బరత్నమ్మ గృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఊటుకూరు ఎంపీటీసీ నాగా శేఖర్‌రెడ్డి, పెద్దకారంపల్లి సర్పంచ్ వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రోళ్లమడుగులో అత్యంత వేడుకగా నిర్వహించిన యల్లమ్మ జాతరలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరావు ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆకేపాటి పాల్గొని యల్లమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందరికి తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చొప్పా ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశేష పూజలందుకున్న మల్లూరమ్మ



భక్తులకు దర్శనమిస్తున్న మల్లూరమ్మ

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యా నదిపై కొలువైన శ్రీ మల్లూరమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

తైవాన్ టెక్‌లో పరిశోధనకు ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : వైవీయూ రసాయన శాస్త్ర విభాగానికి చెందిన సహ ఆచార్యులు డాక్టర్ ఎల్.సుబ్రమణ్యంశర్మను తైవాన్ దేశంలో నెల రోజులపాటు పరిశోధనలు చేసేందుకు ఆహ్వానం అందింది. ఈయన జులై 1వ తేదీ నుంచి ప్రతిష్ఠాత్మకమైన తైవాన్‌టెక్ తైపేలో ఉంటూ విద్యుత్ రసాయన శక్తిని ఉపయోగించి విద్యుత్ శక్తి తయారు చేయడంలో వినియోగించే ప్యూయల్ సెల్‌పై పరిశోధన చేస్తారు. తైవాన్‌టెక్, కెమికల్ ఇంజనీరింగ్ ఆచార్యులు బింగ్– జు– హ్వాంగ్ ఆధ్వర్యంలో పరిశోధనలు చేయనున్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు ఆయనను అభినందించారు.

గుంతలు తీశారు.. అవస్థలకు గురిచేశారు

గాలివీడు : కేబుల్ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం సామాన్యులకు గుదిబండగా మారాయి. గాలివీడు – నూలివీడు రోడ్డు మార్గంలో కేబుల్ పనుల నిమిత్తం తమకు నచ్చిన విధంగా ఇళ్ల ముంగిట నుంచి జేసీబీల సహాయంతో 10 అడుగుల లోతు వరకు గుంతలను తవ్వి, పనులను పూర్తి చేయడంతో గత 10 రోజులు నుండి అలాగే వదిలేశారు. దీంతో గాలివీడు – నూలివీడు రోడ్డు మార్గంలో ప్రయాణించే వారికి ఇక్కట్లు తప్పడంలేదు. కేబుల్ కాంట్రాక్టర్లు నిబంధనల ప్రకారం సూచిక బోర్డులను ఏర్పాటు చేయకుండా, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పట్టించుకోకుండా పనులు చేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. పల్లెలో రైతుల ఇళ్ల ముంగిట అసంపూర్తిగా వదిలేయడంతో రైతులు, గ్రామస్తులు ఇళ్లలో నుంచి బయటకు రావాలన్నా, పశువులకు మేతకు తీసుకెళ్లాలన్నా గుంతల వల్ల అవస్థలు పడుతున్నారు. అలానే కేబుల్ కాంట్రాక్టర్లు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన పైపులను ధ్వంసం చేయడంతో గ్రామంలో నీటి ఎద్దడి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్డు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



బోడసానివాండ్లపల్లెలో కేబుల్ ఏర్పాటు కోసం తీసిన గుంత

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగ చూడు తల్లీ అంటూ భక్తులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి వేకువజామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తుల ఆలయమెట్లకు పూజలు చేశారు.



సంతాన ప్రాప్తి కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

వినయ, విధేయతలతో ఉన్నత శిఖరాలు

కురబలకోట : వినయ విధేయతలతో ఉన్నత శిఖరాలు చేరవచ్చని బైబిల్ చెబుతోందని అంగళ్లులోని సీయోను చర్చి ప్రధాన ఫాస్టర్ డాక్టర్ విక్టర్ వేదనాయకమ్ పేర్కొన్నారు. ఆదివారం చర్చిలో జరిగిన ఆరాధన, బల్ల వర్తమానంలో ఆయన వాక్యోపదేశం చేస్తూ ఒక దేశం నుంచి మరో దేశానికి చెరగా కొనిపోబడి ఆపై తల్లిదండ్రులు లేని అనాధ యువతి ఎస్తేరు అన్నారు. ఇలాంటి ఆమె సువిశాల పర్షియన్ సామ్రాజ్య చక్రవర్తి అహశ్వరోషు రాణిగా మారిందన్నారు. ఇది ఎస్తేరు జీవితంలో జరిగిన అసాధారణమైన గొప్ప కార్యమన్నారు. అనాధ యువతి గొప్ప సామ్రాజ్య చక్రవర్తికి రాణి కావడమంటే ఊహకు కూడా అందనిదన్నారు. ఆమెలోని వినయ విధేయతలతోనే ఇది సాధ్యమైందన్నారు. దీనికి తోడు ఆమె వెనుక దేవుని కృప కీలకంగా పనిచేసిందన్నారు. లోబడి జీవించడం ఆమెకు చిన్ననాటి నుండి అలవాటుగా మారిందన్నారు. అదే ఆమె ఉన్నత శిఖరాలు చేరడానికి దోహపడిందన్నారు. విలువ లేని వాటికి విలువనిచ్చి నిలబెట్టడం దేవునికే సాధ్యమన్నారు. పరిస్థితులను మారుస్తాడన్నారు. ప్రతికూలాన్ని కూడా అనుకూలంగా మారుస్తాడన్నారు. అందం ఆకర్షణ కన్నా వినయ విధేయతలు గొప్పవని బైబిల్ చెబుతోందన్నారు.



దైవ సందేశం ఇస్తున్న విక్టర్ వేదనాయకమ్

పుస్తకాలు పక్కదారి..!

మదనపల్లె సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు సకాలంలో అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు మే నెల చివరి వారంలో ఆయా మండల కేంద్రాల స్టాక్ పాయింట్‌లకు తరలించారు. గోదాంలో పుస్తకాలు నిల్వ చేసి పాఠశాలలకు పంపిణీ చేపట్టింది. అయితే ఇందులో నుంచి భారీ ఎత్తున పాఠ్యపుస్తకాలు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మదనపల్లె నియోజకవర్గం పరిధిలోని మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో 275 పాఠశాలలు ఉండగా 21,810 మంది విద్యార్థులున్నారు. వారి కోసం ఇప్పటి వరకు 1,31,995 పుస్తకాలు వచ్చాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓ గదిలో పుస్తకాలను నిల్వ ఉంచారు. ఇక్కడ నుంచి పాఠశాలలకు పుస్తకాలు సరఫరా చేస్తారు. గోదాం నుంచి పుస్తకాలు రహస్యంగా బయటకు తరలించినట్లు తెలుస్తోంది. ఈ పుస్తకాలను కొందరు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, బుక్ సెంటర్లకు విక్రయించినట్లు సమాచారం. పుస్తకాలపై ఉన్న ప్రభుత్వ లోగోపై స్టిక్కర్లు అతికించి వినియోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిసింది. ఇందులో పని చేసే వారే పాఠ్యపుస్తకాలను బయటకు పంపించినట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం విద్యాశాఖ స్టాక్‌పాయింట్ నుంచి వచ్చిన పుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేసినట్లు నివేదికలు ఇచ్చారు. అయితే పలు పాఠశాలలో విద్యార్థులకు ఇప్పటి వరకు చాలా మందికి పాఠ్యపుస్తకాలు అందలేదు. ప్రతి ఏటా ఇక్కడ నుంచి పుస్తకాలు బయటకు తరలుతున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం పాఠ్యపుస్తకాలు అందని పాఠశాలల నివేదికలు పరిశీలిస్తే అసలు విషయం బయటపడే అవకాశం ఉంది.

విచారణ చేస్తా

పాఠ్యపుస్తకాలు పక్కదారిపట్టిన విషయంపై విచారణ చేస్తా. ఇప్పటికే పుస్తకాల విషయంపై తన దృష్టికి వచ్చిందన్నారు. ఇటీవల గోదామును పరిశీలించాను. గోదాముకు వచ్చిన పాఠ్యపుస్తకాలు, పాఠశాలలకు పంపిణీ చేసిన పుస్తకాలను పరిశీలిస్తాను. ఇందులో ఎవరైన బయట వ్యక్తులకు అమ్మినట్లు విచారణలో తేలితే చర్యలు తీసుకుంటాం.

– శ్రీరాం పురుషోత్తం, డీవైఈఓ

ఆపదలో ఆదుకోవడమే మానవత ధ్యేయం



రాయచోటి టౌన్: నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న సంస్థ సభ్యులు



చిట్వేలి: ప్రమాణస్వీకారం చేస్తున్న మానవత సభ్యులు

రాయచోటిటౌన్ : ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత ధ్యేయం ఆ సంస్థ కేంద్ర కమిటీ నియంత్రణ డైరెక్టర్ రాతాల గోపి అన్నారు. ఆదివారం రాయచోటి డైట్ కళాశాలలో సభా భవనంలో నూతన సభ్యుల కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కష్టాల్లో ఉన్నవారికి సాయం చేయడంలో ముందు వరుసలో ఉండాలన్నారు. మనవత ధ్యేయాన్ని కొనసాగించేలా నూతన కమిటీ సభ్యులు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అనంతరం నూతన కమిటి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఇలాంటి సేవా సంస్థను ఏర్పాటు చేసిన వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షులుగా సంచుల ఖాదర్ బాషా, రాయచోటి మానవత శాఖ చైర్మన్ అరమాటి శివశంకర్, సెక్రటరీ అంకం జయచంద్రారెడ్డి, కోశాధికారి మురళీ మోహన్, ఉపాధ్యక్షులు గంగాధర్ నాయుడు, సభ్యులు శ్రీధర్‌రెడ్డిలు నూతన కమిటీ సభ్యులను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఈశ్వరయ్య, నాగేశ్వర్ (సన్నీ), అష్రఫ్ అలీ, నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల డైరెక్టర్ శివ విష్ణు మోహన్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు చింతం వెంకట్రామిరెడ్డి (బాబు), వృక్ష రక్షణ సమితి అధ్యక్షులు తులసీశ్వరరెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు రియాజుద్దీన్, ఎస్‌కే హెస్సేన్, ప్రొఫెషనల్ కొరియర్ సర్వీస్ నిర్వాహకుడు షఫీ, రిటైడ్ పశుసంవర్ధక శాఖ జేడీ ముత్యాల భూపతి రమేష్, రోటరియన్ డాక్టర్ కెవిఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలిలో..

చిట్వేలి : మానవత చిట్వేలిశాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక సాయి వికాష్ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎంపిక చేశారు. ఈ మేరకు మానవత కడప కేంద్ర కమిటీ డైరెక్టర్ సభ్యులు రెడ్డన్న, కడప టౌన్ కార్యదర్శి టివి సుబ్బరాయుడులు పాల్గొన్న సమావేశంలో అధ్యక్షులు మునిరావు కార్యదర్శిగా, సాయిరాం కోశాధికారిగా, రంగారెడ్డి గౌరవ డైరెక్టర్ బోర్డు సభ్యులుగా, చైర్మన్‌గా తిరుమల విశ్వనాథం, ఉమామహేశ్వర్ రెడ్డి, సురేంద్రారెడ్డి, శ్రీనివాసులు, వీరాంజనేయ రాజులను ఎంపిక చేసి వారి చేత ప్రమాణం చేయించారు.

ఘర్షణలో ముగ్గురికి గాయాలు

మదనపల్లె: ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు వ్యక్తులు గాయపడిన సంఘటన కురబలకోట మండలంలో జరిగింది. నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ చింతయ్యగారికుంటకు చెందిన కొండప్ప కుమారుడు శ్రీనివాసులు (47) అదే గ్రామంలోని ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. ప్రేమ వ్యవహారం కారణంగా ఆ అమ్మాయి వివాహం చేసుకోకుండా, కుటుంబ సభ్యులు తెచ్చిన సంబంధాలను నచ్చలేదని చెబుతూ వస్తోంది. ఈ క్రమంలో శ్రీనివాసులు కారణంగానే తమ ఇంటి అమ్మాయి పెళ్లి చేసుకోలేదన్న కోపంతో ఆదివారం అమ్మాయి తండ్రి వెంకటరమణ, తమ్ముడు మల్లికార్జున కలిసి శ్రీనివాసులు కుటుంబసభ్యులో ఘర్షణకు దిగారు. గొడవలో ఓ వర్గంలోని కొండప్ప, శ్రీనివాసులు గాయపడగా మరో వర్గంలోని వెంకటరమణ గాయపడ్డాడు.

ఎంపీ మిథున్‌రెడ్డి హౌస్ అరెస్ట్ అప్రజాస్వామికం



నడివీధి సుధాకర్

నందలూరు : రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని హౌస్ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని రాజంపేట వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ నడివీధి సుధాకర్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులతోపాటు చివరకు ఓటర్లు మీద కూడా దాడికి తెగబడుతున్నారన్నారు. ఆ దాడులను అధికార పార్టీ వారు ఖండించలేకపోవడం, దాడులను ప్రోత్సహించే విధంగా ఉందే తప్పా అదుపు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పుంగనూరులో కార్యకర్తలపైన జరుగుతున్న దాడులను, దాడి జరిగిన వారిని పరామర్శించడానికి కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఆ సమావేశానికి వెళ్లడానికి వీల్లేదని జిల్లా పోలీసు అధికారులు మిథున్ రెడ్డిని హౌస్ అరెస్టు చేయడం అంటే రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. అధికారం శాశ్వతం కాదనేది గుర్తించుకోవాలన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే పనులు చేపట్టాలే కానీ కక్షసాధింపు చర్యలు చేపట్టడం ప్రజాస్వామ్యాన్ని అప్రతిష్టపాలు చేయడమేనని అభివర్ణించారు. రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని పుంగనూరు మీటింగ్‌కు వెళ్లడానికి పోలీసులు సహకరించాలని కోరారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు సరైన గుర్తింపు



సంబేపల్లె: వెంకటరామరాజు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



పెనగలూరు: లలితమ్మను సన్మానిస్తున్న అధికారులు

సంబేపల్లె : ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని డీఈఓ శివప్రకాష్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వెంకటరామరాజుకు పదవీ విరమణ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ విద్యాపరంగా, సామాజికపరంగా ఉత్తమ సేవలు అందించినప్పుడే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా సామాజిక స్పృహ, శాస్త్రీయత గురించి విద్యార్థులకు నేర్పించాలన్నారు. ప్రస్తుతం పదవీ విరమణ చెందుతున్న వెంకటరామరాజు తమ బాధ్యతను ఏమాత్రం విస్మరించకుండా విద్యార్థులతో అభ్యున్నతికి విశేషంగా కష్టపడ్డారన్నారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ప్రదర్శించిన కలర్ పార్టీ (అతిథులకు ఆహ్వానం పలికే తీరు), విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం, చెక్కభజన, నృత్యాలు పలువురిని ఆకర్షించాయి. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందిన వెంకటరామరాజుకు బంగారు ఉంగరాన్ని బహూకరించారు. అనంతరం ఉపాధ్యాయులు, బంధుమిత్రులు వెంకటరామరాజు దంపతులను పూలమాలలు, దుశ్శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నాగేశ్వర్ నాయుడు, టీడీపీ బీసీ సాధికార సమితి పాల ఏకరి రాష్ట్ర కన్వీనర్ శివప్రసాద్ నాయుడు, ఎంఈఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న సబ్‌స్టాఫ్ లలితమ్మను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమానికి మాజీ ఎంపీడీఓ వరప్రసాద్, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లలితమ్మ మండలంలో రెండు పర్యాయాలు ఎనిమిది సంవత్సరాలపాటు ఇక్కడ పనిచేశారన్నారు. కార్యాలయానికి వచ్చే రాజకీయ నాయకులు, అధికారులు, ప్రజలకు ఎంతో అనుకూలంగా ఉంటూ మంచి పేరు సంపాదించారని కొనియాడారు. అనంతరం లలితమ్మ మాట్లాడుతూ ఈ మండలానికి తమకు ఎంతో అవినాభావ సంబంధం ఉందని ఆమె అన్నారు. నాయకులు, ప్రజలు ఎంతో గౌరవంగా ఆదరించారని, ఈ మండల వాసులకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది, ఉపాధి, పంచాయతీ రాజ్ సిబ్బందులు పాల్గొన్నారు. ఏఓ పద్మభూషన్ రెడ్డి, రఘు ఇతర సిబ్బంది ప్రత్యేకంగా లలితమ్మను సన్మానించారు.